క్లుప్తంగా

హంసవాహనంలో శ్రీచక్రార్చన



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అరసవల్లి: కార్తీక శుద్ధ పౌర్ణమి సందర్భంగా ప్రసిద్ధ సూర్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ ఇంద్రపుష్కరిణిలో సోమవారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంద్రపుష్కరిణిలో ఉన్న హంసవాహనంలో అమ్మవారికి సాంగాపూర్వక శ్రీచక్రార్చన శాస్త్రోక్తంగా జరిపించారు. పౌర్ణమి సందర్భంగా 108 దీపాలతో ఆరాధన, నక్షత్ర హారతి తదితర కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం నిర్వహించారు. అనంతరం పుష్కరిణిలో మూడు సార్లు హంసవాహనాన్ని విహరింపజేసి, వేదమంత్రోచ్ఛారణలు, మంగళధ్వనుల మధ్య పౌర్ణమి పూజలు ముగించారు. భక్తులకు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సేవలకు సత్కారం



తారకేశ్వరరావును సన్మానిస్తున్న దృశ్యం

గార: మండలంలోని రామచంద్రాపురం పంచాయతీ సెగిడిపేటకు చెందిన తారకేశ్వరరావును ఘనంగా సత్కరించారు. గ్రామస్తులకు అందించిన వైద్యసేవలకు గుర్తుగా జొన్నలపాడు కాలనీలోని ఆంజనేయస్వామి గుడి వద్ద ఆలయ ధర్మకర్త పండి అర్జునరావు ఆధ్వర్యంలో దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఖాతాదారులు ఆందోళన చెందొద్దు



ఖాతాదారులతో మాట్లాడుతున్న ఆర్ఎం రాజు

గార: మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో బంగారం మాయంపై ఇటీవల పుకార్లు వచ్చిన నేపథ్యంలో ఖాతాదారులు ఆందోళన చేపట్టారు. సోమవారం బ్యాంకు వద్దకు పెద్ద ఎత్తున ఖాతాదారులు రావడంతో పోలీసులు వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు. అనంతరం బ్యాంకు రీజనల్ మేనేజర్ రాజు వచ్చి బ్రాంచి మేనేజర్ సీహెచ్ రాధాకృష్ణతో మాట్లాడారు. డిసెంబర్ 8 తర్వాత ఖాతాదారులు వచ్చి తనఖా పెట్టిన బంగారం తీసుకోవచ్చన్నారు. ఖాతాదారులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గార సీఐ ఎస్.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీలకు 11 మంది ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ప్రిన్సిపాల్ సురేఖ

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల నుంచి అంతర్ యూనివర్సిటీ యోగా పోటీలకు అత్యధికంగా 11 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ తెలిపారు. ఈ మేరకు సోమవారం కళాశాల ఆవరణలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేడ్కర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సౌత్ వెస్ట్ ఇంటర్ యూనివర్సిటీ యోగ మెన్ అండ్ ఉమెన్ సెలక్షన్స్‌లో టి.దివాకర్, ఆర్.రాజేష్, బి.రవీంద్ర, ఎస్.గణేష్, బి.శివసాయి, బి.మోహన్‌ప్రతాప్, పి.షర్మిల, పి.శఫరిన్, కె.దీప, టి.మణిమాల, పి.సమ్మరీన్ ఎంపికైనట్లు వివరించారు. వీరంతా డిసెంబర్ 1 నుంచి 4 వరకు తమిళనాడులోని అన్నా యూనివర్సిటిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా కార్తీక దీపోత్సవం



పూజల్లో పాల్గొన్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: నారాయణ తిరుమల కొండపై వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని దీపాలు వెలిగించారు.

ప్రభంజనం



చిలకపాలెంలో బహిరంగ సభకు హాజరైన జనసందోహంలో ఓ భాగం



బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు. పక్కనే ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



బహిరంగ సభకు విచ్చేస్తున్న వై.వి. సుబ్బారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు



బస్సులో వై.వి.సుబ్బారెడ్డి, నాయకులు

- సామాజిక సాధికార యాత్రకు విశేష స్పందన
- వేలాది మందితో కిక్కిరిసిన చిలకపాలెం రోడ్డు
- ఉత్సాహంగా సాగిన యాత్ర
- వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఆనందం

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం జనజాతరను తలపించింది. ఎచ్చెర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రకు విశేష స్పందన లభించింది. జై జగన్ నినాదాలతో సభా ప్రాంగణం హోరెత్తింది. చిలకపాలెం- పొందూరు రోడ్డులో నిర్వహించిన సభావేదిక వద్దకు వేలాది మంది ప్రజలు తరలివచ్చి ప్రభుత్వానికి మద్దతు తెలియజేస్తూ నినాదాలు చేశారు. ఎచ్చెర్ల, లావేరు, జి.సిగడాం, రణస్థలం మండలాల్లోని 100 గ్రామ సచివాలయాల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా హాజరై బహిరంగ సభ, బస్సుయాత్రను విజయవంతం చేశారు. అంతకుముందు ఉదయం ఉదయం 10 గంటలకు పైడిభీమవరంలో మైనారిటీ మతపెద్దలు, విశ్రాంత ఉద్యోగులతో ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఇతర నాయకులు పైడిభీమవరంలో సమావేశం నిర్వహించారు. రణస్థలంలో విలేకరులతో మాట్లాడారు. అనంతరం రణస్థలంలో సామాజిక సాధికార బస్సుయాత్రను ఉత్తరాంధ్ర వైఎస్సార్ సీపీ ప్రాంతీయ సమన్వయకర్త వై.వి. సుబ్బారెడ్డి ప్రారంభించారు. మార్గమధ్యలో బుడుమూరు గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ప్రభుత్వ పథకాల అమలు తీరు, సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం చిలకపాలెం చేరుకున్నారు.

ట్రాఫిక్ మళ్లింపు..

వాహన చోదకులకు, ట్రాఫిక్‌కు, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్ మళ్లింపుతో పాటు, సర్వీస్ రోడ్డులో వాహనాల రాకపోకల నియంత్రణ, పార్కింగ్ స్థలం ఏర్పాటు, పాదచారులు సభకు చేరుకునే వరకు పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సభ విజయవంతం కావటంతో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు, పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గ/మండల నాయకులు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, లంకలపల్లి ప్రసాద్, జెడ్పీటీసీలు టొంపల సీతారాం, మీసాల సీతంనాయుడు, కాయల వెంకటరమణ, బల్లాడ హేమామాలిని రెడ్డి, ఎంపీపీలు మొదలవలస చిరంజీవి, మీసాల సత్యవతి, మండల నాయకులు చిల్ల వెంకటరెడ్డి, మహంతి పెదరామినాయుడు, బల్లాడ జనార్దన్‌రెడ్డి, ముద్దాడ శంకర్, మురళీధరబాబా, జీరు రామారావు, కె.వి.వి సత్యనారాయణ, మూగి శ్రీరాములు, మీసాల వెంకటరమణ, డోల వెంకటరమణ, బత్తుల సన్యాసిరావు, దన్నాన రాజీనాయుడు, రొక్కం బాలకృష్ణ, మీసాల సీతంనాయుడు, మీసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



వేదికపై జానపదగీతాలు ఆలపిస్తున్న వంగపండు ఉష

రణస్థలం: జగనన్న ప్రభుత్వ పథకాల వల్ల ప్రజలు ఏ విధంగా లబ్ధి పొందుతున్నారో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు వంగపండు ఉషా, ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ వంకాయల మారుతి ప్రసాద్ బృందం తమ ప్రదర్శనల ద్వారా అలరించారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు చేసిన దోపిడీని పాటల రూపంలో వివరిస్తుంటే మహిళల నుంచి విశేష స్పందన లభించింది. అలాగే కోష్ట కోలాటం, తప్పెడుగుళ్లు, డీజే ధ్వనులతో సభా ప్రాంగణం దద్దరిల్లింది.

ప్రత్యేక స్వాగతం..

అభిమానులు బాణసంచా కాల్చి బస్సుయాత్రకు ఆహ్వానం పలికారు. జగనన్న నామస్మరణతో సభాప్రాంగణం దద్దరిల్లింది. మహిళలు, వృద్ధులు సైతం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఉపన్యాసాలు విని కరతాళ ధ్వనులతో మద్దతు పలికారు. నియోజకవర్గ ద్వితీయ శ్రేణి నాయకులు ఉదయం నుంచే చిలకపాలెం ఏర్పాట్లు సమీక్షించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు వంగ పండు ఉష ఆధ్వర్యంలో కళాబృందం ఆట పాట ఆకట్టుకుంది. గత, ప్రస్తుత ప్రభుత్వాల వ్యత్యాసాలు, రైతులకు, మహిళలకు చంద్రబాబు చేసిన మోసం, జగనన్న సంక్షేమ పథకాలు అమలుపై ప్రత్యేక పాటలతో అలరించారు. మహిళలు వేదిక వద్ద చేసిన కోలాటం ఆకట్టుకుంది.

సుపరిపాలనే లక్ష్యంగా ముందుకు..



ఎంపీ, ఎమ్మెల్యేలకు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కిరణ్ కిరణ్‌కుమార్
- మతపెద్దలు, విశ్రాంత ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులతో ఆత్మీయ సమావేశం

రణస్థలం: రాష్ట్రంలో సుపరిపాలన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. పైడిభీమవరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం మతపెద్దలు, విశ్రాంత ఉద్యోగులు, పరిశ్రమ కాంట్రాక్టర్లు, సచివాలయ ఉద్యోగులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సామాజిక సాధికారత పాలనలో చూపిస్తున్నామని చెప్పారు. గతంలో జన్మభూమి కమిటీల పేరుతో నచ్చినవారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు అందజేసిన ఘనత టీడీపీ ప్రభుత్వానికి దక్కుతుందని విమర్శించారు.

గ్రామ స్థాయిలో సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ ప్రారంభించి అర్హులను గుర్తించి ఇళ్లకే ప్రభుత్వ పథకాలను చేర్చిన ఘనత నేటి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో పాలన పట్ల ప్రజలు పూర్తిస్థాయి సంతృప్తితో ఉన్నారని తెలిపారు. సామాజిక సాధికార యాత్రకు ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోందన్నారు. మంచి చేసే పార్టీకి ప్రజలు ఎల్లప్పుడూ అండగా ఉంటారని చెప్పారు. అనంతరం పలువురు మతపెద్దలు, విశ్రాంత ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనపై సంతృప్తి వ్యక్తం చేశారు. తండ్రి రాజశేఖర రెడ్డి పాలనను మరిపించేలా పాలన సాగుతోందన్నారు. అందరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని, క్రైస్తవులకు గౌరవ వేతనం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, ఎచ్చెర్ల నియోజకర్గ పరిశీలకుడు నెక్కల నాయుడుబాబు, ఎచ్చెర్ల ఏఎంసీ చైర్మన్ లంకలపల్లి ప్రసాద్, మతపెద్దలు బవిరి రమణ, సీహెచ్ రూబెన్, షేక్ మస్తాన్, యడ్ల పాపినాయుడు, శామ్యూల్ తదితరులు ఉన్నారు. అంతకుముందు పైడి భీమవరంలో వైఎస్సార్ విగ్రహానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఘనంగా ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవం



రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) 75వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.

కార్యక్రమంలో రిమ్స్ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి డాక్టర్ జోత్స్న, ఎన్‌సీసీ అధికారులు కెప్టెన్ మహేష్, కెప్టెన్ పోలినాయుడు, వైస్ ప్రిన్సిపల్ ఎం.వి.సత్యనారాయణ, 14వ ఆంధ్ర బెటాలియన్ సుబేదార్ గిరీష్, దల్వీర్ సింగ్, హవాల్దార్ ఏ.ఎం.రావు తదితరులు పాల్గొన్నారు.

రావాడలో ఆరు ఇళ్లు దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రణస్థలం: మండలంలోని రావాడలో సోమవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో ఆరు ఇళ్లు దగ్ధమయ్యాయి. గ్రామస్తులు, అగ్నిమాపక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రావాడ గ్రామంలో యామల మజ్జి, యామల అప్పన్న, ముక్కు రమణ, ముక్కు అంకమ్మ, యామల లచ్చుము, యామల అశిరయ్యల ఇళ్లల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న రణస్థలం అగ్నిమాపక అధికారి పి.అశోక్ బృందంతో హుటాహుటీన వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.25లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు అంచనా. ఆధార్ కార్డులు, నగదు, బంగారం, భూముల పత్రాలు అన్నీ కాలిపోవడంతో బాధితులు బోరున విలపిస్తున్నారు. గ్రామస్తులు, రెవెన్యూ అధికారులు స్పందించి తక్షణ సహాయం అందజేశారు.

కలెక్టర్‌ను కలిసిన బీసీ సంఘ నేతలు



స్పందన కార్యక్రమానికి వచ్చిన బీసీ సంఘాల ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సోంపేట శివరామనగర్‌లో వాడుకలో లేని చిల్డ్రన్స్ పార్కును అభివృద్ధి చేసి బీసీ సంక్షేమ సంఘం భవనం నిర్మాణం, బీసీ జాతీయ నాయకుల విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని ఏపీ బీసీ కులాల సంక్షమ సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన స్పందనలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీసీ నాయకులు బి.చంద్రపతిరావు, ఢిల్లీరావు, బేగ్, బీసీ న్యాయవాదులు సంఘం నాయకులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, బి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు కిట్లు పంపిణీ



కిట్లును అందజేస్తున్న ఎంపీపీ గొండు రఘురాం

గార : ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద క్రీడాకారులకు ప్రభుత్వం అందజేసిన కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంజీవ రమణయ్య, అరవల రామకృష్ణ, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, కొయ్యాన నాగభూషణం, సర్పంచ్ మార్పు పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా రిజిస్ట్రేషన్లు ప్రారంభం

రణస్థలం: గ్రామస్థాయిలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి 15 ఏళ్లు దాటిన యువతీ, యువకులు ఆన్‌లైన్ ద్వారా గానీ, గ్రామ వలంటీర్, గ్రామ సచివాలయంలో గానీ రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని ఎంపీడీఓ ఆర్.వి.రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. క్రికెట్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడల్లో పాల్గొనవచ్చని, ఈ నెల 30లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తికి గాయాలు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని ఏడురోడ్ల కూడలి వద్ద ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ వ్యక్తికి గాయాలైనట్లు ట్రాఫిక్ ఏఎస్‌ఐ ఢిల్లీరావు తెలిపారు. నగరంలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో నైట్ వాచ్‌మేన్‌గా పనిచేస్తున్న లక్కవరపుకోట పవన్‌కుమార్‌ను మరో ద్విచక్రవాహనదారుడు ఏడురోడ్ల కూడలిలో ఢీకొట్టాడు. ఈ ఘటనలో పవన్‌కుమార్‌కు గాయాలయ్యాయి. బాధితుడి మేనమామ వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ చెప్పారు.

పాఠశాలలకు మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

ఎచ్చెర్ల: అజ్ఞాతశక్తి ఫౌండేషన్ ద్వారా పాఠశాలలకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు గుమ్మడి, అమరనాథ్, జగదీష్ తెలిపారు. సోమవారం ఎస్ఎంపురం ఏపీఆర్ బాలుర పాఠశాలలో మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాను నందనవనంగా మార్చాలనే ఉద్దేశంతో పాఠశాలకు వంద చొప్పున మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

బాడీబిల్డింగ్ పోటీల్లో యువకుడి ప్రతిభ



షేక్ మదీనాను అభినందిస్తున్న స్కూల్‌చైర్మన్

రణస్థలం: మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీల్లో జె.ఆర్.పురం గ్రామానికి చెందిన యువకుడు షేక్ మదీనా సత్తాచాటాడు. యలమంచిలో ఆదివారం జరిగిన ఈ పోటీల్లో 70-80 కేజీల విభాగంలో మూడో స్థానంలో నిలిచి షీల్డ్, ప్రశంసాపత్రం అందుకున్నాడు. ఈ సందర్భంగా యువకుడిని ఎన్ఈఆర్ స్కూల్ చైర్మన్ ఎన్.ఈశ్వరరావు, గ్రామస్తులు సోమవారం అభినందించారు.

శాశ్వత లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న శాశ్వత్ లోక్ అదాలత్ చైర్మన్ సువర్ణరాజు

శ్రీకాకుళం పాతబస్టాండ్: శాశ్వత లోక్ అదాలత్ ద్వారా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా సత్వర న్యాయం అందుతుందని జిల్లా శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.జ్ఞాన సువర్ణరాజు అన్నారు. సోమవారం స్థానిక వికాస్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఎటువంటి సమస్య ఉన్నా ఉచితంగా న్యాయసేవలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కూన వేణుగోపాలరావు, డిప్యూటీ డైరెక్టర్ కూన మురళీకృష్ణ, న్యాయవాది ఇందిరా ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు కళామిత్ర బిరుదు



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు చాడ శ్రీనివాస్‌కు ఒంగోలు కళా సంఘం ప్రతినిధులు కళామిత్ర బిరుదుతో సత్కరించారు. ప్రముఖ సినీ గేయ రచయిత భువన చంద్ర చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను శ్రీనివాస నాట్య మండలి సభ్యులు కె.సంతోష్, గాంధీ, దుర్గాప్రసాద్, ఉమాకవి, తెలుగు రచయితల వేదిక అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి సోమవారం అభినందించారు.